

నాట్కో పాఠశాల సిబ్బందితో ఆకునూరి మురళి

నాట్కో స్కూల్‌ను సందర్శించిన విద్యా కమిషన్ చైర్మన్

బోరబండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సర్కార్ బడుల్లో ఇంగ్లిష్ విద్యను అందరికీ అందించాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. మంగళవారం బోరబండ నాట్కో పాఠశాలను కమిషన్ సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాట్కో పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యనందించాలన్నారు. పాఠశాలకు మంజూరైన అదనపు తరగతి గదుల పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిషన్ ప్రతినిధులు పీఎల్ విశ్వేశ్వరరావు, ఆర్‌జేడీ విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 10 వరకు స్టేట్ హోం ఫీడర్ పరిధిలోని మధురానగర్ ఏ, సీ, డీ,హెచ్ బ్లాకులు.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏసీబీ కార్యాలయం ఫీడర్ పరిధిలోని గోల్డెన్ టెంపుల్ గేట్, ఎస్పీటీ నగర్, పోచమ్మ టెంపుల్, రాశమ్‌బాగ్ అలియా మసీద్ లైన్ ప్రాంతాల్లో.. ఉదయం 10.10 గంటల నుంచి 11 గంటల వరకు జవహర్ నగర్ ఫీడర్ పరిధిలోని జవహర్‌నగర్, కల్యాణ్ నగర్, మధురానగర్ ప్రాంతాల్లో.. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు ఏజీ కాలనీ ఫీడర్ పరిధిలోని ఏజీ కాలనీ, సిద్ధార్థ నగర్, వికాస్‌పురి కాలని, ఈఎస్ఐ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 11 గంటల నుంచి 11.35 వరకు సవేరా ఫంక్షన్ హాల్ ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాల్లో.. ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మారుతీనగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 12.30 నుంచి 1.15 వరకు ఇంజనీర్స్ కాలని ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది.

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..


మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అమీర్ పేట ఆదిత్య ఎన్‌క్లేవ్, బోరబండ పీలి దర్గా ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు హుడా మైత్రివనం, జయశంకర్ నగర్ ఫీడర్ల పరిధిలోని గాయత్రి నగర్, పద్మావతినగర్, ఎన్ఆర్ఆర్‌పురం సైట్-3 ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న సుశీలా బొకాడియా

పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో డిసన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను సామాజికవేత్త సుశీలా బొకాడియా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్ర ఉత్పత్తులను ఒకే వేదికపై ప్రదర్శించడం అభినందనీయమన్నారు. డిసన్స్ పటోలా ఆర్ట్స్ ఎక్స్‌పో నిర్వాహకుడు భవిన్ మక్వానా మాట్లాడుతూ.. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ నెల 11 వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగుతున్న మంటలు

ఆనంద్‌నగర్‌లో అగ్నిప్రమాదం

ఎర్రగడ్డ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ఆనందనగర్ కాలనీలో మంగళవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇందిరా గాంధీ విగ్రహం ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు.

హుండీ కానుకల లెక్కింపు

బంజారాహిల్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వర, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. గత ఏడు నెలల కాలానికి సంబంధించి మొత్తం రూ.19.93 లక్షలు వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కార్తీకమాసం పూర్తయ్యాక మరో సారి కానుకలను లెక్కించనున్నారు.

కులగణనతో అందరికీ న్యాయం

- ఎమ్మెల్యే దానం నాగేందర్
- భారీ ర్యాలీతో రాహుల్ గాంధీకి ఘన స్వాగతం



జూబ్లీహిల్స్ నుంచి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే దానం, కార్పొరేటర్లు వనం సంగీతాయాదవ్, మహాలక్ష్మి, సీనియర్ నాయకుడు నర్సింగరావు తదితరులు



కులగణన సదస్సులో పాల్గొనేందుకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చిన రాహుల్ గాంధీకి ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి రోహిణిరెడ్డిని పరిచయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కులగణనతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కులగణన సమావేశానికి హాజరవుతున్న రాహుల్ గాంధీకి స్వాగతం పలికేందుకు మంగళవారం జూబ్లీహిల్స్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. సరైన లెక్కలు లేకపోవడం వల్ల బడుగు, బలహీన వర్గాల ప్రజలు అన్యాయానికి గురయ్యారన్నారు. కాంగ్రెస్ చేస్తున్న పనుల వల్ల రాజకీయ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని భావించిన ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వనం సంగీతాయాదవ్, మహాలక్ష్మి, సీఎన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మామిడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ గాంధీకి స్వాగతం పలికేందుకు పీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ గణపతి చౌరస్తా నుంచి బయల్దేరుతున్న కాంగ్రెస్ శ్రేణులు

విజయారెడ్డి ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ గణపతి చౌరస్తా నుంచి భారీ ర్యాలీగా బేగంపేట విమానాశ్రయానికి వెళ్లి రాహుల్ గాంధీకి స్వాగతం పలికారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను దశలవారీగా అమలుచేసే దిశగా తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయారెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు.

సర్వేకు సహకరించండి

- ప్రజలకు సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా విజ్ఞప్తి
- నేటినుంచి ప్రారంభం కానున్న సమగ్ర ఇంటింటి సర్వే ప్రక్రియ

బోరబండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జరిగే సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా కోరారు. ప్రతీ ఎన్యూమరేషన్ బ్లాక్ (ఎఫ్‌బీ) పరిధిలో 120 నుంచి 150 ఇళ్లు ఉంటాయని.. సర్వే సిబ్బంది అడిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఆమె ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలను వెల్లడించారు.

ఇంటర్వ్యూ...



సర్వేలో ఎంతమంది సిబ్బంది పాల్గొంటున్నారు?

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు మొత్తం 700 మంది సిబ్బందితో పాటు 70 మంది సూపర్‌వైజర్‌లు సర్వే కోసం పనిచేస్తున్నారు. మొదటి మూడు రోజులు ప్రతి ఇంటికీ సర్వే స్టిక్కర్ అంటిస్తారు. అప్పుడే ఇంటి యజమానితో మాట్లాడి సర్వేకి వచ్చే సమయం చెబుతారు. తాళం వేసి ఉన్న ఇళ్లకు మరోసారి వెళ్తారు.

సర్వే సిబ్బంది ఎలాంటి సమాచారం అడుగుతారు?

ఇంటింటి సర్వేకి వెళ్లే సిబ్బందికి ఫారం ఎలా నింపాలి, ఏ ప్రశ్నలు అడగాలి అనే అంశాలపై కొన్నిరోజుల పాటు శిక్షణ ఇచ్చాం. సర్వే నిబంధనల ప్రకారం సిబ్బందికి యజమాని ఆధార్ కార్డు ప్రకారం సమాచారం ఇవ్వాలి. ఈ వివరాల ఆధారంగా రానున్న రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తిస్తారు.

సర్వే ఫారంలో ఎన్ని ప్రశ్నలు ఉంటాయి?

సర్వే ఫారంలో 75 ప్రశ్నలు ఉంటాయి. ప్రాంతాన్ని బట్టి కొన్ని ఉప ప్రశ్నలు సైతం ఉంటాయి. నగర ప్రజలకు అవసరమైన ప్రశ్నలను మాత్రమే సిబ్బంది అడుగుతారు.

సర్వే నివేదిక ప్రభుత్వానికి ఎప్పటి వరకు అందిస్తారు?

మొదటి రెండు రోజులు ప్రతి ఇంటికీ స్టికర్‌లు అంటిస్తారు. ఆ తర్వాత 15 రోజుల పాటు సమాచారం సేకరిస్తారు. తర్వాత మొత్తం సమాచారాన్ని సరిచూసుకుని ఈ నెల చివరి వరకు ప్రభుత్వనికి అందిస్తాం.

సర్వేపై ప్రజలకు ఇచ్చే సలహాలు?

నిన్నటి వరకు సమగ్ర కుటుంబ సర్వేపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగింది. ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దు. సిబ్బంది సర్వే ఫారంతో కుటుంబ సభ్యుల సమక్షంలోనే సమాచారం సేకరిస్తారు. ఎలాంటి వ్యక్తిగత సమాచారం అడగరు. ప్రతి ఒక్కరూ సిబ్బందికి సహకరించాలి.



సర్వే సిబ్బందికి పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న సర్వే కిట్‌లు

సర్వే సిబ్బందికి కిట్‌ల పంపిణీ

యూసుఫ్‌గూడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభం కానున్న సగ్రమ కుటుంబ సర్వేపై సిబ్బందికి మంగళవారం యూసుఫ్‌గూడ సవేర ఫంక్షన్‌హాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా సిబ్బందికి సర్వే కిట్‌లు, స్టిక్కర్స్, అనుమతి పత్రాలు(ఆర్డర్ కాపీలు) అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, విద్యాశాఖ అధికారులు శ్యామూల్ రాజ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మన సంస్కృతిని విద్యార్థులకు తెలియజేయాలి

ఎర్రగడ్డ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, వారసత్వ మూలాలను విద్యార్థులకు తెలియజేయడం ఎంతో అవసరమని సంస్కార్ ది లైఫ్ స్కూల్ ఫౌండర్ సీఈవో ఏ.మోహన వంశీ అన్నారు. మంగళవారం ఎర్రగడ్డలోని పాఠశాలలో హరేకృష్ణ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫేస్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాతకాలంనాటి దుస్తులు, సంస్కృతి, వారసత్వ మూలాలు, శ్లోకపట్టణం, గీత వంటి పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఏ.మధుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపై సర్వే నిర్వహిస్తున్నాం

- యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ప్రతినిధులు

అమీర్‌పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సేవకులుగా పనిచేయాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సలహాదారులు ఆర్సీ పట్నాయక్ అన్నారు. మంగళవారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారుల పనితీరు, రాజకీయ నాయకుల అవినీతిపై అమీర్‌పేటలోని తన కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్త సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారికి నిస్వార్థంగా సేవ చేయాల్సిన ప్రభుత్వ అధికారుల్లో కొంతమంది అవినీతికి పాల్పడుతూ సామాన్యులను వేధిస్తున్నారని ఆరోపించారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేందర్ పల్నాటి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నవంబర్ 5 నుంచి డిసెంబర్ 5 వరకు సర్వే నిర్వహిస్తామన్నారు. ఈ రిపోర్టును యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ప్రధాన సలహా దారులు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ విడుదల చేస్తారన్నారు.

రెండు పీడీయాక్ట్‌లు.. 47 కేసులు

- అయినా ఆగని చోరీలు
- హాస్టళ్లలోకి ప్రవేశించి మొబైల్స్, ల్యాప్‌టాప్‌ల అపహరణ
- ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు

పంజాగుట్ట/ హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో మొబైల్, ల్యాప్‌టాప్‌లను చోరీ చేసి విక్రయిస్తున్న ముఠాలోని ఆరుగురు సభ్యులను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. నగరానికి చెందిన మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్ తెల్లవారుజామున హోటళ్లు, లాడ్జ్‌లు, హాస్టల్స్‌లోకి వెళ్లి నిద్రలో ఉన్నవారి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్నాడు. అతడిపై రెండుసార్లు పీడీయాక్ట్ నమోదుతో పాటు పలు స్టేషన్‌లలో 47 చోరీ కేసులు నమోదయ్యాయి. పలుమార్లు జైలుకు వెళ్లిన అహ్మద్‌కు కాంబ్లే వీరు, కాంబ్లే వినయ్ పరిచయమయ్యారు. దీంతో జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ముఠా ఏర్పాటు చేసి తన సోదరుడు మహ్మద్ ఇఫ్తికార్ అహ్మద్ అలియాస్ అహ్మద్ సహకారంతో బంజారాహిల్స్, ఆసిఫ్‌నగర్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, మెహదీపట్నం, మొఘల్‌పురా ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన వస్తువులను కాంబ్లే వీరు, రవి, హసన్, కాంబ్లే వినయ్, అశోక్‌కుమార్ అలియాస్ మనోజ్‌ల సాయంతో విక్రయిస్తున్నాడు. ఎండీ హిదాయతుల్లా అలియాస్ తాజ్, మహ్మద్ ఇషాన్‌ల సహకారంతో వాటిని అన్‌లాక్ చేసి అలీబిన్ సలీమ్ అలియాస్ అలీబాబా వద్ద భద్రపరిచేవారు. నిఘా పెట్టిన పంజాగుట్ట పోలీసులు చోరీలకు పాల్పడుతున్న ఇంతియాజ్ అహ్మద్‌తో పాటు అతడికి సహకరిస్తున్న వారిని అరెస్ట్ చేసిరూ. 2లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు.



ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొని భోజనానికి ప్యారడైజ్ హోటల్‌కు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ను కలిసిన బేగంపేట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టి.శ్రీహరి తదితరులు

- బేగంపేట, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి)

హెల్మెట్ వినియోగంపై నిర్లక్ష్యం తగదు

- ఏసీపీ కట్టా హరిప్రసాద్



ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న వారికి గులాబీ ఇచ్చి అభినందిస్తున్న ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వినియోగంపై వాహన చోదకుల్లో నిర్లక్ష్యం పెరుగుతోందని పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ అన్నారు. కేబీఆర్ పార్కు చౌరస్తాలో హెల్మెట్ వినియోగంపై మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వారిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ కొనుగోలు చేస్తేనే వాహనాలు ఇస్తానని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్న వాహనదారులకు గులాబీ ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. హెల్మెట్ వాడకంపై అవగాహన తీసుకువచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. చాలా సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడంతో మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయి ప్రకాశ్, ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగులచవితి పూజలు



పూజలు నిర్వహిస్తున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితిని పురస్కరించుకుని మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాగదేవత ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయ ఆవరణలో ఉన్న నాగ దేవతకు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ఉన్న నాగదేవత ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేశారు. పాము పుట్టల వద్ద భక్తుల రద్దీతో కోలాహలం నెలకొంది.

సమస్యలను పరిష్కరించండి

- అధికారులను కోరిన కార్పొరేటర్



వాటర్ వర్క్స్ జీఎం వినోద్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కలుషిత తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు బ్రాహ్మణవాడి రహదారిలో నిత్యం మురుగు ప్రవహిస్తోంది. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి మంగళవారం వాటర్ వర్క్స్ జీఎం వినోద్, డీజీఎం ఆశీశ్‌ను కోరారు. శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లోని ఎరుకల బస్తీ, బ్రాహ్మణవాడి చివరి ప్రాంతాలతో పాటు వడ్డెరబస్తీ, మాతాజీనగర్, బేగంపేట బస్తీలలో తరచూ కలుషిత సరఫరా అవుతుందని కార్పొరేటర్ పేర్కొన్నారు. దీంతో పాటు కుందన్‌బాగ్ నుంచి పెద్ద ఎత్తున మురుగునీరు వచ్చి బేగంపేటపేట రైల్వే పట్టాల కింద నుంచి బ్రాహ్మణవాడి రహదారిలో ప్రవహిస్తుందని.. ఈ సమస్యలను పరిష్కరించాలని ఆమె సూచించారు.

నిమ్స్ వాస్కులర్ విభాగంలో వెయ్యి సర్జరీలు

- వైద్యులను అభినందించిన డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి



అభినందన కార్యక్రమంలో పాల్గొన్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్సల్లో నిమ్స్ రికార్డు నమోదు చేస్తోంది. వాస్కులర్ విభాగంలో ఈ ఏడాది పది నెలల్లో వెయ్యి సర్జరీలు చేశారు. గత ఏడాది 12 నెలల్లో వెయ్యి సర్జరీలు చేశారు. ఈ సందర్భంగా వాస్కులర్ సర్జరీ విభాగం అధిపతి ప్రొఫెసర్ సందీప్ మహాపాత్ర ఆధ్వర్యంలో డైరెక్టర్ నగరి బీరప్పతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. సర్జరీల్లో పాల్గొన్న డాక్టర్ అనూష, ఇతర వైద్యులు, నర్సింగ్ స్టాఫ్‌ను డైరెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ వర్సిటీలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

అంబేడ్కర్ వర్సిటీలో ఖాళీ స్థలం లేదు

- జేఏసీ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఖాళీ స్థలమే లేదని, విద్యార్థులకు కొత్తగా కంప్యూటర్ ల్యాబ్స్ నిర్మించే అవసరముందని అంబేడ్కర్ వర్సిటీ జేఏసీ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ అన్నారు. నూతన విద్యా విధానం ప్రకారం (నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ(ఎన్ఈపీ)-2020 ఎక్కువ మంది విద్యార్థులకు విద్యావకాశాలను అందించడానికి వివిధ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వర్సిటీకి చెందిన పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించొద్దని డిమాండ్ చేస్తూ మంగళవారం జూబ్లీహిల్స్‌లోని వర్సిటీ ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన లేఖను వెంటనే ఉపసంహరించుకోవాలని వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ జేఏసీ నేతలు, అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'తో ఫలించిన 46 ఏళ్ల నిరీక్షణ



రైతు పిచ్చయ్యకు పాసుబుక్‌ను అందజేస్తున్న డా. చిన్నారెడ్డి, దివ్య

- పాసుపుస్తకం కోసం 1978 నుంచి ఎదురుచూపులు
- ప్రజావాణి ద్వారా వంద రోజుల్లోనే తీరిన ఓ రైతు కష్టం

బేగంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తనకున్న ఒక ఎకరం సాగుభూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం కోసం సుమారు నలభై ఆరేళ్లగా ఎదురుచూస్తున్న ఓ రైతు నిరీక్షణ ఎట్టకేలకు ప్రజావాణి ద్వారా ఫలించింది. నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన పిచ్చయ్య అనే రైతుకు స్వగ్రామంలోని సర్వే నెంబరు 215/3లో ఒక ఎకరం భూమి ఉంది. దాని పట్టాదారు పాసుపుస్తకం కోసం 1978 నుంచి రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుని అప్పటి నుంచి తిరుగుతున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏర్పాటు చేసిన ప్రజావాణి గురించి తెలుసుకున్న పిచ్చయ్య గత జూలైలో ప్రజావాణిలో పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు చేసుకున్న వంద రోజుల్లోనే పాసుపుస్తకం పిచ్చయ్య చేతికి అందింది. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన పిచ్చయ్య.. తనకు వచ్చిన పట్టాదారు పాసుపుస్తకాన్ని ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యలకు చూపించి ధన్యవాదాలు తెలిపారు. ప్రజావాణి వల్ల అనతి కాలంలోనే తన కష్టం తీరిపోయిందన్నారు. కాగా, ప్రజావాణిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం మంగళవారం 1031 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

బస్టాప్‌లో షెల్టర్ లేక ఎండలోనే ప్రయాణికులు

● గాంధీ ఆస్పత్రి వద్ద రోడ్డుపై బస్సుల కోసం నిరీక్షణ



రోడ్డుపైన ఎండలో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

పద్మారావునగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించడలో ఆర్టీసీ విఫలమవుతుంది. దాంతో ప్రయాణికులు ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఇది నగరంలో రెండో పెద్దాస్పత్రిగా పేరుగాంచిన గాంధీ ఆస్పత్రి వద్ద దుస్థితి. నగర ప్రజలతో పాటు జిల్లాల నుంచి వివిధ పరీక్షలు, వైద్యం కోసం వందల సంఖ్యలో ప్రజలు, రోగులు గాంధీ ఆస్పత్రికి వస్తుంటారు. బస్టాప్‌లో ఆర్టీసీ బస్సులను అక్కడ నిలుపుతున్నా, బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చే వారు అధికంగా పేద, మధ్యతరగతికి చెందిన వారు కావడం, వారు ఆర్టీసీ బస్సులలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఆస్పత్రికి వచ్చి పోయే రోగులతో పాటు వారి సహాయకులు, విజిటర్స్, వాహన సదుపాయం లేని ఆస్పత్రి సిబ్బంది కూడా బస్టాప్‌లోనే బస్సుల కోసం వేచి ఉంటారు. బస్ షెల్టర్ ఏర్పాటు చేయకపోవడం బాధకారం.

కొన్నాళ్ళ క్రితం గాంధీ ఆస్పత్రి ప్రధానగేటు సమీపంలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సమయంలో అడ్డుగా ఉందని బస్ షెల్టర్‌ను పూర్తిగా తొలగించారు. అప్పటి నుంచి ఆర్టీసీ అధికారులు అక్కడ బస్ షెల్టర్ ఏర్పాటు చేయలేదు. దాంతో అక్కడ ఆటోలో, ప్రైవేట్ వాహనాలను పార్కు చేస్తున్నారు. బస్ షెల్టర్ లేక, బస్టాప్‌లో నిలవడానికి స్థలం కూడా లేకపోవడంతో ప్రయాణికులు రోడ్లపై ఎండలో నిల్చుంటున్నారు.

ఈఎస్ఐ కార్యాలయం వద్ద మరోలా..

గాంధీ ఆస్పత్రి వద్ద పరిస్థితి ఇలా ఉంటే, దానికి ఎదురుగా ఉన్న ఈఎస్ఐ కార్యాలయం వద్ద పరిస్థితి మరోలా ఉంది. బస్‌షెల్టర్ ఓచోట ఉంటే బస్సులను ఆర్టీసీ డ్రైవర్లు మరోచోట ఆపుతున్నారు. బస్‌షెల్టర్ ఉన్నా నిర్వహణ లోపం కారణంగా అపరిశుభ్రంగా మారి ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది. ప్రయాణికులు బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియక అవస్థలు పడుతున్నారు. రోడ్డు మధ్యలో మెట్రో పిల్లర్, ఓవైపు ఈఎస్ఐ కార్యాలయ ప్రహరీ, ఫుట్‌పాత్ దుకాణాలతో పాటుగా ప్రైవేట్ వాహనాల పార్కింగుతో రోడ్డు ఇరుకుగా మారి బస్సు ఎక్కటానికి ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విగ్రహం ఏర్పాటు చేశారు.. షెల్టర్ మరిచారు



ఆస్పత్రి ఎదురుగా భారీ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అధికారులు, బస్‌షెల్టర్ ఏర్పాటును మరిచారు. బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను ఏర్పాటుచేయాలి.

\- వై.శ్రీనివాస్ ముదిరాజ్, బన్సీలాల్‌పేట్

బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలి



నగరంలోని గాంధీ ఆస్పత్రికి రోజూ వందల సంఖ్యలో పేదమధ్య తరగతి ప్రజలు చికిత్స కోసం వస్తుంటారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో వారంతా రోడ్లపై ఎండలోనే నిల్చుంటున్నారు. వర్షంలో తడుస్తున్నారు. సంబంధిత అధికారులు బస్‌షెల్టర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

\- నేరేటి రవి, హమాల్‌బస్తీ

తులం బంగారం ఎప్పుడు ఇస్తారో చెప్పాలి: తలసాని



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన తులం బంగారం ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రజలు అడుగుతున్నారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో బేగంపేట, రాంగోపాల్‌పేట్ మోండా మార్కెట్, బన్సీలాల్‌పేట డివిజన్లకు చెందిన 128 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం తలసాని మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల తల్లిదండ్రులకు భారం కాకూడదని, బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి 11 నెలల అవుతున్నా ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్న ఆయన, అర్హులకు తులం బంగారం ఎప్పుడు ఇస్తారో చెప్పాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆర్డీవో, తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరామ్, తహసీల్దార్ ఇస్లావత్ పాండు నాయక్, కార్పొరేటర్లు టి.మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, వెంకటేషన్ రాజు, నాయకులు శ్రీహరి, కిషోర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్‌పల్లి/తిరుమలగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సూచించారు. ప్రజల సౌకర్యార్థం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆర్డీవో సాయిరామ్, తహసీల్దార్ అశోక్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అర్హులైన దరఖాస్తుదారులు ప్రజాపాలనసేవా కేంద్రాలను సందర్శించి ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేయించుకోవచ్చని ఎమ్మెల్యే శ్రీగణేశ్ సూచించారు. ఇందుకోసం రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నెంబర్ తమవెంట తీసుకురావాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని రషీదును తీసుకుని వచ్చి అప్డేట్ చేసుకోవాలని సూచించారు. మంగళవారం 33 మంది అప్డేట్ చేసుకున్నారని తహసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు సదానంద్, బల్వంత్‌రెడ్డి, మల్లికార్జున్, అస్రఫ్, మారుతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీవో కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అభినందించిన స్టీఫెన్ రవీంద్ర



కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న స్టీఫెన్ రవీంద్ర

అడ్డగుట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరుగు పోటీలలో మెడల్స్ సాధించిన ఎస్పీవో కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సీనియర్ ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్ర అభినందించారు. మూడు రోజుల క్రితం గచ్చిబౌలి స్టేడియంలో 5 కిలో మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. గచ్చిబౌలిలో ఎస్పీవో కానిస్టేబుల్‌గా విధు లు నిర్వహిస్తున్న శ్రీనివాస్ పోటీలలో పాల్గొన్నాడు. 5 కిలో మీటర్లను 14 నిమిషాల్లో పరిగెత్తి మెడల్ కైవసం చేసుకున్నాడు. మంగళవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారి ప్రశాంత్, స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొని కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు మెడల్స్ అందజేశారు. కాగా 2022, జూన్‌లో బెంగళూర్‌లో నిర్వహించిన 10 కిలో మీటర్ల పోటీలో పాల్గొని 33 నిమిషాలలో పూర్తి చేసి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. అదేవిధంగా 2023లో గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 50 కిలో మీటర్ల పరుగు పోటీలో పాల్గొని 3 గంటల 10 నిమిషాల్లో పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచారు. ఎస్పీవో కానిస్టేబుల్‌గా పరుగు పోటీ లలో రాష్ట్రానికి పేరు ప్రతిష్టతలు తీసుకురావాలని సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆకాంక్షించారు. మెడల్స్ సాధించిన శ్రీనివాస్‌ను పోలీస్ ఉన్నతాధికారులు, తోటీ కానిస్టేబుళ్లు అభినందించారు.

బేగంపేట డివిజన్‌లో కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి



జలమండలి జీఎం, డీజీఎంతో సమావేశమైన కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లో కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ మహేశ్వరి కోరారు. జలమండలి కార్యాలయంలో వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ (జీఎం) వినోద్, డిప్యూటీ జనరల్ మేనేజర్(డీజీఎం) ఆశిక్‌తో మంగళవారం కార్పొరేటర్ సమావేశం అయ్యారు. బేగంపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా అవుతుందని వివరించారు. శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లోని ఎరుకలబస్తీ, బ్రాహ్మణవాడి చివరి ప్రాంతాలతోపాటు వడ్డెరబస్తీ, మాతాజీనగర్, బేగంపేట బస్తీలలో తరచూ తాగునీటిలో కలుషితనీరు వస్తున్నదన్నారు. బ్రాహ్మణవాడి రహదారిలో నిత్యం మురుగు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుందన్‌బాగ్ నుంచి బేగంపేట రైల్వే పట్టాల కింద నుంచి మురుగునీరు ప్రవహించడంతో బ్రాహ్మణవాడిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు కార్పొరేటర్ మహేశ్వరి తెలిపారు.

నగరంలో పర్యటించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ రైల్వేస్

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ రైల్వేస్ మంగళవారం నగరంలో పర్యటించింది. ఎంపీ సీఎం రమేశ్ ఛైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. సోమవారం దక్షిణమధ్యరైల్వే పరిధిలోని తిరుపతిలో పర్యటించిన ఈ కమిటీ, మంగళవారం సికింద్రాబాద్‌కు చేరుకొని రైల్‌నిలయంలో దక్షిణమధ్యరైల్వే అధికారులతో సమావేశమయ్యారు.

రైల్వేలకు సంబంధించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. ఆయా అంశాలకు సంబంధించి జరిపిన చర్చల్లో వ్యక్తమైన విషయాలతో నివేదికను పార్లమెంట్‌కు సమర్పించే అవకాశం ఉందని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు. స్టాండింగ్ కమిటీ సూచనల మేరకు రైల్వే మంత్రిత్వశాఖకు పార్లమెంట్ నుంచి ఆదేశాలు వెళ్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. దక్షిణమధ్యరైల్వే పరిధిలో రెండ్రోజుల పర్యటనను ముగించుకున్న స్టాండింగ్ కమిటీ సభ్యుల బృందం మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లింది.



సురేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న మహాసభ అధ్యక్షుడు మర్యాల జగదీశ్వర్, ఎన్నికల అధికారి ఆగిరి వెంకటేష్

సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ

అధ్యక్షుడిగా పాలూరి సురేష్

రాంగోపాల్‌పేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పట్టణ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడిగా వాసవీనగర్‌కు చెందిన పాలూరి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024-26 సంవత్సరాలకుగాను సికింద్రాబాద్ ఆవులమందలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మర్యాల జగదీశ్వర్ అధ్వర్యంలో నామినేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఉపాధ్యక్షుడు ఆగిరి వెంకటేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. పాలూరి సురేష్ ఒక్కడే నామినేషన్ దాఖలు చేయడంతో, ఆయనను అధ్యక్షుడిగా ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు.

నేడు లక్ష్మీనారాయణ ఆలయంలో అన్నకూట్

రాంగోపాల్‌పేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో బుధవారం అన్నకూట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్తీకమాసం శుద్ధపంచమి రోజున దేవస్థానం వారు స్వామి వారికి అన్నకూట్ నిర్వహిస్తుంటారు. పోటు (వంటశాల)లో వండిన పులిహోర, లడ్డూ, బూందీ, దద్దోజనం, క్షీరాన్నం, కదంబం తదితర నైవేద్యాలను స్వామి వారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిని భక్తులకు శాత్తుమురై గోష్టి (సహపంక్తి)లో ప్రసాద వితరణ చేస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, గుమిడెల్లి రవీందర్, ఆలయ ఈవో కొమ్మాలు తెలిపారు.



నామాలగుండులో రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద క్యూలో భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగులపంచమి

బౌద్ధనగర్/చిలకలగూడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో మంగళవారం నాగులపంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నామాలగుండు రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులు అధికసంఖ్యలో పుట్టలో పాలు పోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. మేడిబావి ముత్యాలమ్మ ఆలయం, బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం తదితర ఆలయాల్లో జరిగిన పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మెట్టుగూడలోని జగన్మాత ఆలయం, రేణుక ఎల్లమ్మ ఆలయం, దూద్‌బావి తదతర ప్రాంతాల్లోని మహిళలు పుట్టల వద్దకు వచ్చి పాలుపోసి పుట్టమన్ను తీసుకుని ఉపవాస దీక్ష చేపట్టారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

సీసీ రోడ్డు పనుల పరిశీలన

బౌద్ధనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వారాసిగూడలో నూతనంగా చేపడుతున్న సీసీరోడ్డు పనులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భం గా రోడ్డు పనులను వేగంగా పూర్తిచేయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు.

అనారోగ్య, ఆర్థిక సమస్యలతో

వ్యక్తి ఆత్మహత్య

బౌద్ధనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య, ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి అత్మహత్య చేసుకున్నాడు. చిలకలగూడ పోలీసులు, మృతుడు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్ ఆసిఫ్ నగర్‌కు చెందిన సిహెచ్.శ్రీనివాస్‌సాగర్ (45) మేస్త్రీ పనులు చేస్తుంటాడు. బంధువులకు అప్పుగా ఇచ్చిన డబ్బులు ఇవ్వకపోవటంతో కొద్దిరోజులుగా మనోవేదనకు గురవుతున్నాడు. దీంతోపాటు అనారోగ్య సమస్యలతో బాధపడు తూ ఈనెల4న భార్య అఖిలతో కలిసి సికింద్రాబాద్‌లో ఓ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా క్యాన్సర్‌గా తేలింది. మరిన్ని పరీక్షలు చేయాలని వైద్యులు సూచించటంతో ఉప్పరబస్తీలో అమ్మవాళ్ల ఇంటికి వచ్చారు. పిల్లలు ఇంట్లో ఒంటరిగా ఉండటంతో భార్య అఖిల సోమవారం రాత్రి కార్వాన్‌కు వెళ్లింది. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో అఖిల చెల్లెలు రెండో అంతస్తుకు వెళ్లి చూడగా, బాల్కనిలోని దస్తులు ఆరేసే హుక్‌కు ఉరేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'ఉస్మానియా' వద్ద బాలుడి కిడ్నాప్

● గంటల వ్యవధిలో కిడ్నాపర్ పట్టివేత
● తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీసీపీ బాలస్వామి, ఏసీపీ శంకర్, సీఐ లింగేశ్వర్‌రావు

అఫ్జల్‌గంజ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్ కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులు 12 గంటల్లో ఛేదించారు. క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. మంగళవారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ బి.బాలస్వామి, ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు కిడ్నాప్ వివరాలను వెల్లడించారు. మల్లేపల్లి మంగర్‌బస్తీకి చెందిన మహ్మద్ సద్దాం, రుబీనాబేగం భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. సద్దాంకు అనారోగ్యంగా ఉండడంతో వైద్యం కోసం సోమవారం కుమారుడు షోయబ్(4)ని తీసుకొని ఉస్మానియా ఆస్పత్రికి వచ్చాడు. ఆస్పత్రిలో చూపించుకున్న తర్వాత ఓపీ భవనం వద్ద పడుకున్నాడు. వరంగల్ ప్రాంతానికి చెందిన షేక్ రఫీక్(38) వారిని గమనించాడు. షోయబ్‌ని తీసుకుని కాలినడకన ఆబిడ్స్, సుల్తాన్‌బజార్, చాదర్‌ఘాట్ నుంచి డబీర్‌పురాకు వెళ్లాడు. రాత్రి అయినా భర్త తిరిగిరాకపోవడంతో ఆందోళన చెందిన రుబీనాబేగం ఉస్మానియా ఆస్పత్రి వద్దకు వచ్చింది. సద్దాం ఫుట్‌పాత్‌పై పడుకుని ఉండగా, షోయబ్ కనిపించలేదు. వెంటనే అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ రావు నాలుగు ప్రత్యేక బృందాలతో బాలుడి కోసం వెతికారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. షేక్ రఫీక్ బాలుడిని తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా బాలుడిని ఓ మహిళ వద్ద ఉంచినట్లు తెలిపాడు. డీఎస్ఐ రామకృష్ణ, టీమ్ బాలుడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కిడ్నాపర్ రఫీక్ నాలుగేళ్ల క్రితం వరంగల్ నుంచి నగరానికి వచ్చి ఫుట్‌పాత్‌లపై నివసిస్తూ, మద్యానికి బానిసై డబ్బుల కోసం బాలుడిని కిడ్నాప్ చేశాడని డీసీపీ వెల్లడించారు.

పోగొట్టుకున్న బ్యాగు ప్రయాణికుడికి అందజేత



బ్యాగు అందజేస్తున్న కానిస్టేబుల్ సందీప్‌కుమార్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైలులో పోగొట్టుకున్న బ్యాగును ప్రయాణికుడికి అందజేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన ఓ వ్యక్తి బ్యాగు తీసుకుని మంగళవారం నాంపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలు కోసం వేచి చూస్తుండగా పక్కన బ్యాగు కనిపించలేదు. వెంటనే నాంపల్లి ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ సందీప్‌కుమార్‌కు బాధితుడు ఫిర్యాదు చేశారు. బ్యాగులో ఆధార్ కార్డు, పాన్‌కార్డు, రేషన్ కార్డు, చెక్కులు, 120 గ్రాముల సిల్వర్ వస్తువులు ఉన్నాయని తెలిపారు. రైల్వేస్టేషన్‌లో గాలించిన రైల్వే పోలీసులు ఓ చోట పడి ఉన్న బ్యాగును గుర్తించి బాధితుడికి అందజేశారు.

ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు: డీజీపీ జితేందర్



డీజీపీ జితేందర్‌కు మెమెంటో అందజేస్తున్న నిర్వాహకులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. అంబర్‌పేట వాటర్‌వర్క్స్ గ్రౌండ్‌లో డీఏబీటీ, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం(టీడీసీఏ) సంయుక్తంగా నిర్వహిస్తున్న అంధుల క్రికెట్ పోటీలను డీజీపీ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగ క్రికెటర్ల ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. సంకల్ప బలం ఉంటే అసాధ్యమనేది ఏదీ ఉండదనే అందుకు వీరే ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సీనియర్ సిటిజన్ శాఖ కమిషనర్ శైలజ, టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, డీఏబీటీ కార్యదర్శి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

తాడ్‌బంద్ చౌరస్తాలో రాహుల్‌గాంధీకి ఘన స్వాగతం



తాడ్‌బంద్ చౌరస్తాలో రాహుల్ గాంధీకి స్వాగతం చెబుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కులగణన సదస్సుకు హాజరయ్యేందుకు ఏఐసీసీ అగ్రనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ నగరానికి వచ్చారు. మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో దిగిన ఆయన, అక్కడి నుంచి కాన్వాయ్‌లో బోయినపల్లిలోని బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌కు వెళ్లారు. బోయినపల్లి తాడుబంద్ చౌరస్తాలో రాహుల్‌గాంధీకి స్వాగతం పలకడానికి భారీ కటౌట్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. విమానశ్రయం నుంచి సాయంత్రం 5.15 గంటల ప్రాంతంలో తాడ్‌బండ్ చౌరస్తా మీదుగా రాహుల్‌గాంధీ కాన్వాయ్ వెళ్తుండగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పార్టీ శ్రేణులతో కలసి రాహుల్‌గాంధీకి స్వాగం పలికారు. జైకాంగ్రెస్.... జైజై కాంగ్రెస్ అంటూ బ్యానర్లు పార్టీ జెండాలు పట్టుకొని పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. బ్యాండ్ మేళాలు, టపాసులు పేల్చారు. చౌరస్తాలో రాహుల్ గాంధీ కాన్వాయ్ వాహనము నిలపకుండానే నేరుగా కార్యక్రమం జరిగే చోటుకు వెళ్లిపోయింది. రాహుల్‌గాంధీని చూడడానికి తాడ్‌బండ్ చౌరస్తాకు వచ్చి మూడు గంటల పాటు వేచి ఉన్న పార్టీ శ్రేణులు, అభిమానులు నిరాశకు చెందారు.

మేడ్చల్ వరకు మెట్రో రైలు కావాలి

● బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్ వద్ద నిరసన



బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మెట్రో సాధన సమితి ప్రతినిధులు

బోయిన్‌పల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ వరకు మెట్రో రైల్ కావాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి డిమాండ్ చేసింది. నగరానికి ఉత్తర బాగంలో ఉన్న మేడ్చల్ శామీర్‌పేట్ ప్రాంతాలకు మెట్రో రైలు పొడిగించాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు మంగళవారం బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్ వద్ద ప్లకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకుని నిరసన చేపట్టారు. ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ.. గాంధీ ఐడియాలజీ సెంటర్‌కు వస్తున్నట్లు తెలుసుకున్న మేడ్చల్ సాధన సమితి ప్రతినిధులు కేంద్రం వద్దకు చేరుకుని మేడ్చల్ వరకు మెట్రో రైలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా సాధన సమితి సభ్యులు మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళామని, నగరంలోని వివిధ ప్రాంతాలకు మెట్రో రైలు ప్రాజెక్టును పొడిగించాలని నిర్ణయించినప్పటికీ మేడ్చల్‌కు మాత్రం మెట్రో రైలు పొడిగించడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు ఎన్ని ఫ్లైఓవర్లు వేసినా రహదారులను విస్తరించినా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడంలేదని అన్నారు. ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య తొలగాలన్నా ఉత్తర బాగంలో నివశిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలన్నా మెట్రో ఒక్కటే మార్గమని తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, జార్జ్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.